యువతి అదృశ్యం

- షేక్ రెహాన్ పాషాతో వెళ్లి ఉంటుదన్న తల్లిదండ్రులు

దీపికాధార

చార్మినార్, అక్టోబర్ 21 : ఇంట్లోంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దిలీఫ్‌దరా కుటుంబం కొన్ని సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీరాలం మండి ప్రాంతంలో నివసిస్తున్నారు. అతని కుమార్తె దీపికాధార గత నెల 30వ తేదిన కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో మీర్‌చౌక్ పోలీసులను ఆశ్రయించారు. స్థానికంగా నివసించే షేక్ రెహాన్ పాషాతో కలిసి వెళ్లి ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారని ఇన్‌స్పెక్టర్ రవీందర్ వెల్లడించారు. యువతి ఆచూకీ తెలిపిన వారు మీర్, ఔక్ పోలీసలకు సమాచారం అందించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

26నుంచి ఫుట్‌బాల్ సీజన్ ట్రయల్స్

టైగర్ ఇండియా ఖేలో ఫుట్‌బాల్ సీజన్ 4 ట్రయల్స్ మెదక్, హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్‌లో జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఇండియా ఖేలో ఫుట్‌బాల్ టైగర్ క్యాపిటల్ హైదరాబాద్ లిటిల్ స్టార్స్ సాకర్ అకాడమీ, సౌత్ క్లాస్ ఫుట్‌బాల్ క్లబ్‌తో జతకట్టి టైగర్ ఐకేఎఫ్ 4 ట్రయల్స్ హైదరాబాద్ లెగ్‌ని గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో అక్టోబర్ 26, 27వ తేదీలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ట్రయల్స్‌కు హాజరయ్యే ఆటగాళ్లు మొదట సిటీ ట్రయల్స్ నుంచి స్కౌట్ చేయబడతారని వివరించారు. – అబిడ్స్

ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలి

మెహిదీపట్నం, అక్టోబర్ 21: మెహిదీపట్నం ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్ నమ్రత కార్మికులను వేధిస్తుందని ఇందుకు అధికారులు చర్యలు చేపట్టాలని డ్రైవర్లు, కండక్టర్లు సోమవారం డిపో ముందు ధర్నాకు దిగారు. డిపోలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని, గతంలో ఆమె పనిచేసిన డిపోలో కూడా వివాదస్పదంగా వ్యవహరించిందని నాయకులు ఆరోపించారు. ఎప్పుడూ చూసినా డబ్బులు తేవాలని వేధిస్తుందని, అక్యుపెన్సీ రేషియో లేకపోతే తాము డబ్బులు ఎలా తెస్తామని డ్రైవర్లు వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమంతు, బుల్లెట్ పాండు, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక కార్యాలయం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

గోల్నాక, అక్టోబర్ 21 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం గోల్నాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 10మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.3.47లక్షల విలువ గల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. అనారోగ్యానికి గురై దవాఖానల్లో చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన దాదాపు ఐదున్న రేండ్ల కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కోట్లాది రూపాయలు బాధితులకు అందజేసామని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఐ శ్రీనివాసరావుకు సీఎం ప్రశంసలు

రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ కాంపిటేషన్‌లో సౌత్‌వెస్ట్‌జోన్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెన్నమళ్ల శ్రీనివాసరావు ప్రతిభ కనబరిచారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో మూడు గోల్డ్‌మెడల్స్, ఒక సిల్వర్ మెడల్‌ను సాధించాడు. దీంతో శ్రీనివాసరావుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్, స్టార్ ఆఫ్ ది ఇయ్యర్ అవార్డులను సోమవారం అందించి ప్రశంసించారు. – అబిడ్స్

కళలలో చిన్నారులను ప్రోత్సహించాలి

కళాకారులను సత్కరించిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 21 : ఫ్యూచర్ టీచర్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా ఆబిడ్స్ తిలక్‌రోడ్డులో గల తెలంగాణ సారస్వత హాలులో కళాసంఘం శీర్షికన నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం అలరించింది. ఫ్యూచర్ టీచర్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు రేవతి, డైరక్టర్ ఎన్.వి. ప్రసాద్ నేతృత్వంలో పలువురు ఔత్సాహిక కళాకారులు భారతీయ శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాంశాలను వేదికపై ప్రదర్శించి కళాప్రియుల మన్ననలు అందుకున్నారు. అనంతరం జరిగిన సభలో సినీ నటుడు సుమన్, నటి సంధ్యారాణి, డైరక్టర్ స్వరూప్ రాజ్, నటులు శ్యాం కల్యాణ్, నవీన్‌కృష్ణ, రాజీవ్ సిద్ధార్థ, గురువులు ఏ. రమాదేవి, ఎల్. పద్మశ్రీ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి కళారంగాలలో ఆసక్తి ఉన్న పిల్లలను తీర్చిదిద్ది భావికళాకారులుగా తయారుచేయవలసిన బాధ్యత గురువులదేనని గుర్తు చేశారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

రక్తదానం చేసిన దివ్యాంగుడికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ జె. చంద్రమోహన్, గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్

మెహిదీపట్నం, అక్టోబర్ 21: పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో నేను కూడా భాగస్వామి అవుతానంటూ ఓ దివ్యాంగుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. అన్ని అవయవాలు సరిగ్గా ఉండి రక్తదానం చేయడానికి వెనుకంజ వేస్తున్న యువతకు ఇతడు ఆదర్శంగా నిలుస్తాడని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ జె. చంద్రమోహన్ అభినందించారు. సోమవారం పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోల్కొండలో పోలీసులు మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. దీని గురించి తెలుసుకున్న సాలెనగర్ కంచలో నివసిస్తున్న జాహెద్ రక్త దానం చేశాడు. ఇతడికి డీసీపీ చంద్రమోహన్, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లతో కలిసి ప్రశంసాపత్రాన్ని అందించారు.

అదేవిధంగా లంగర్‌హౌస్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ఏసీపీ సయ్యద్ ఫయాజ్,ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్,మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి ప్రశంసాపత్రాలను అందించారు.

నారీశక్తి శిరోమణి అవార్డుల ప్రదానం


డాక్టర్ లయన్‌లుర్డ్ జ్యోతి కాకుమానుకు నారీశక్తి అవార్డును ప్రదానం చేస్తున్న వేణుగోపాలచారి

రవీంద్రభారతి, అక్టోబర్ 21 : తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, శ్రీ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని పలువురికి నారీశక్తి, నేషనల్ అవార్డ్స్ శిరోమణి – 2024 అవార్డుల బహూకరణ కార్యక్రమం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి సమాజ సేవకులకు పురస్కారాలను ప్రదానం చేశారు. శ్రీ ప్రగతి ఫౌండేషన్ చారిటిబుల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ లయన్ లుర్డ్ జ్యోతి కాకుమానుకు నారిశక్తి శిరోమణి అవార్డును బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు వల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోషామహల్ పోలీస్ స్టేడియంలో అమర వీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి. రమేశ్ గుప్తా, సురేశ్ ముదిరాజ్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. – అబిడ్స్, అక్టోబర్ 21

రోగులకు మెరుగైన సేవలు

చార్మినార్, అక్టోబర్ 21 : ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నామని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ రజినిరెడ్డి తెలిపారు. సంతాన లేమితో బాధపడే వారి కష్టాలను తొలగించడానికి వైద్య చికిత్సల్లో మెరుగైన పద్ధతులను అవలంభించే ఐవీఎఫ్ కేంద్రాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. దూర ప్రాంతాల్లోని గర్భిణులకు టెలి మెడిసిన్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు.

పార్లమెంట్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

రవీంద్రభారతి, అక్టోబర్ 21 : పార్లమెంట్ ప్రాంగణంలో నేజాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆలిండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సీనియర్ అడ్వకేట్ ప్రొఫెసర్ దశరథరామిరెడ్డి అన్నారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆజాద్ హింద్ ప్రభుత్వం 82వ వ్యవస్థాపక వార్షికోత్సవ సందర్భంగా ఆలిండియా జైహింద్‌పార్టీ, సమాజ్వాది పార్టీ ఆధ్వర్యంలో ఆజాంద్ హిందీ ఫౌజ్ సుప్రీం కమాండర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు జస్టిస్ చంద్రకుమార్, పీఠాధిపతులు జగద్గురు శ్రీకాంత్ చారి, ఐఎఎస్ ట్రైనర్ రాఘవేంద్ర, బెంగాల్ సమితి అధ్యక్షుడు ముఖర్జీ తదితరులు పాల్గొని నేజాజీ సుభాష్ చంద్రబోష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. నేజాజీ అదృశ్యంపై నియమించిన షాన్వాజ్‌ఖాన్, ముఖర్జీ కమిషన్ రిపోర్ట్‌ను బహిరంగ పరుచాలని అన్నారు. జనవరి 23 నుంచి అన్ని విద్యాసంస్థల్లో నేతాజీ గురించి తెలియజేయాలని, పాఠ్యాంశాల్లో నేతాజీ చరిత్ర పొందపరుచాలని అన్నారు. శ్రీనివాస్‌రావు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలిపితే లాఠీచార్జి చేస్తారా : ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్, అక్టోబర్ 21: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడిని నిరసిస్తూ నిరసన తెలిపిన హిందువులపై పోలీసులు లాఠీచార్జి చేయడంతో గాయాల పాలయ్యారని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పోలీసులు హిందువులపై అక్రమ కేసులు పెట్టడంతో పాటు దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ప్రధానంగా హిందూ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే వెంటనే వారిని విడిపించేందుకు న్యాయవాదుల బృందాన్ని ఏర్పాటు చేయడంతో తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. సికింద్రాబాద్ హోటల్‌లో 150 మందికి శిక్షణ ఇచ్చిన వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. అక్కడ శిక్షణలో పాల్గొన్న వ్యక్తి గుడిపై దాడి చేశాడంటే మిగిలిన 150 మంది ఎక్కడెక్కడ ఏమి చేస్తున్నారో ప్రత్యేకంగా నిఘా పెట్టాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు.

లాఠీచార్జి చేసిన పోలీసులపై హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు

లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు చేస్తున్న వానరసేనా ప్రతినిధులు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 21 : సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను నిరసిస్తూ నిర్వహించిన బంద్‌లో హిందువులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో వాసనసేనా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెచ్‌ఆర్సీ ఆవరణలో వానరసేనా ప్రతినిధులు మాట్లాడుతూ.. శాంతియుతంగా నిర్వహిస్తున్న బంద్‌లో హిందువులపై విచక్షణా రహితంగా లాఠీచార్జిచేసి గాయపరిచిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు తాళ్లగడ్డ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

కార్వాన్, అక్టోబర్ 21 : తాళ్లగడ్డలోని హనుమాన్ ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తాళ్లగడ్డ యువజన సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆంజనేయ స్వామి ప్రతిమకు నూతనంగా వెండి మకర తోరణం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలతో పాటు మకర తోరణ సంప్రోక్షణ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పూజల అనంతరం సాయంత్రం 7 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ అశోక్ కుమార్‌ను సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి హుస్సేన్ షా అలీ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. – సుల్తాన్‌బజార్

ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష

- అర నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించని పోలీసులు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 21 : గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష-2024 ప్రశాంతంగా జరిగాయి. సోమవారం కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో నిర్వహించిన పరీక్షా కేంద్రాలలో గ్రూప్-1 పరీక్షా సజావుగా కొనసాగింది. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి నేతృత్వంలో ఎస్ఐలు మధుసూదనాచారి, అంకం నరేశ్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు చేపట్టారు. కాగా వరంగల్‌కు చెందిన శ్రీలేఖ అభ్యర్థిని అర నిమిషం ఆలస్యం ఐనందున పరీక్ష కేంద్రంలోకి అనుమతించ లేదు. కోఠి మహిళా వర్సిటీలో వింగ్ -ఏలో 792 మంది అభ్యర్థులకు గాను 735 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా 57 మంది గైర్హాజరయ్యారు. వింగ్-బిలో 864 మంది అభ్యర్థులకు గాను 789 మంది పరీక్ష రాయగా 75 మంది గైర్హాజరయ్యారు. ఇదిలా ఉండగా వివేక్ వర్ధిని కళాశాలలో 528 మంది అభ్యర్థులకు గాను 461 మంది పరీక్ష రాయగా 67 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపారు. కాగా అర నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి శ్రీ లేఖ పెట్టుకున్న కంటతడి అందరినీ కలిచివేసింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,అక్టోబర్ 21: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(35)సోమవారం ఉందానగర్-జూకల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. సిమెంట్ రంగు టీషర్ట్, నీలి రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 8712568495లో సంప్రదించాలని కోరారు.

ద్విచక్రవాహనాల దొంగ రిమాండ్

కాచిగూడ, అక్టోబర్ 21: రద్దీగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేటలోని జిల్లెలగూడ, బీరప్పకాలనీ ప్రాంతానికి చెందిన రాజు కుమారుడు చింత వేణు(26)వృత్తిరీత్యా బ్యాండ్ వాయిస్తాడు. ఇటీవల వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన 4 ద్విచక్రవాహనాలను దొంగలించాడు. దొంగిలించిన వాహనాలను అమ్ముకుంటూ దర్జాగా తిరుగుతున్నాడు. ఎస్సై గండికోట సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా వేణుపై అనుమానం వచ్చి ఆరాతీయగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. అతని దగ్గర నుంచి 4 ద్విచక్రవాహనాల్ని స్వాధీనం చేసుకొని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సమాన్విత్‌రెడ్డికి సత్కారం

సమాన్విత్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 21 : స్పందన నృత్యకేళి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వ్యస్థాపకుడు డాక్టర్ నామని రవికుమార్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు ప్రాంగణంలో రివర్స్ స్కేటింగ్ చేస్తూ కూచిపూడి నాట్య ప్రదర్శనలో సోలో కూచిపూడి డ్యాన్స్ విభాగంలో ఒకేసారి 10 ప్రపంచ రికార్డులు సాధించిన కట్ట సమాన్వితారెడ్డికి ధ్రువీకరణ పత్రాల ప్రదానోత్సవం జరిగింది. భారత్ వరల్డ్ రికార్డ్సు వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వి. రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, సీఎస్‌డబ్ల్యూ ఇన్‌చార్జి డీసీపీ గిరిరాజు, అడ్వకేట్ చక్రపాణి, విశ్వగురు వరల్డ్ రికార్డు వ్యవస్థాపకులు డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు శాస్త్రీయ నృత్యాంశాలతో ఆహూతులను అలరించారు.

కోదండరెడ్డికి అభినందనలు

వ్యవసాయ శాఖ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన కోదండరెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందించి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్‌గుప్తా, ఏనుగుల వినోద్‌కుమార్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్

శాంతి భద్రతల రక్షణకు సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకం

కాచిగూడ, అక్టోబర్ 21: నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ అన్నారు. గోల్నాక ప్రాంతంలో ఇటీవల ఏర్పాటు చేసిన 12 కెమెరాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గండికోట సురేశ్‌కుమార్, వార్డు సభ్యుడు శ్యామ్, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాం

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 21 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎం)లో 78 క్యాడర్‌లలో పని చేస్తున్న 17,541 మంది ఉద్యోగుల సమస్యలను నవంబర్ 16వ తేదీలోగా పరిష్కరించని పక్షంలో సమ్మెకు దిగుతామని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్ ఖన్నా సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు క్యాడర్ ఫిక్స్ చేసి బేసిక్ వేతనాలు అమలు చేయడంతో పాటు జీవో జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో ప్రజల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, 2016 సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, బేసిక్ పే అమలు చేయాలని కోరారు. నవంబర్ 16వ తేదీ లోపు క్యాడర్ ఫిక్సేషన్‌లోఎటువంటి అవకతవకలు లేకుండా ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల మూల వేతనం ఉండే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె చేయడానికి కూడా వెనుకాడబో మని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహారావు శతజయంతి నాటకోత్సవాలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 21 : తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో తెలంగాణ తొలి మాండలిక నాటకరచయిత కోదాటి లక్ష్మీనరసింహారావు శతజయంతి సందర్భంగా నాటకోత్సవాలను నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిలో నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాంచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలను మంగళవారం సాయంత్రం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సాహిత్య అకాడమీ పూర్వ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ థియేటర్ సమర్పణలో కె.ఎల్ నరసింహారావు రచించిన ఉంగరాల వేళ్లు నాటికను ప్రదర్శిస్తారని వెల్లడించారు.

బయో టాయిలెట్ బస్సు బీభత్సం

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 21 : నాంపల్లిలోని ఇందిరా ప్రియ దర్శిని మహిళా డిగ్రీ కళాశాల ప్రధాన ద్వారం వద్ద జీహెచ్ఎంసీ బయో మొబైల్ టాయిలెట్ బస్సు బీభత్సం సృష్టించింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష -2024 కేంద్రాన్ని కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరీక్ష రాసేందుకు వచ్చే అభ్యర్థుల నిమిత్తం జీహెంఎంసీ ఆధ్వర్యంలో రెండు బయోమొబైల్ టాయిలెట్ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో గోడను ఢీ కొట్టడంతో గోడ, గేటు రెండు ధ్వంసమయ్యాయి. అక్కడే విధుల్లో ఉన్న సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్ వెంటనే తేరుకొని బస్సు ఢీ కొట్టడంతో క్రింద పడిన గేటును పోలీసు సిబ్బందితో పక్కన పెట్టించారు. దీంతో పరీక్ష కేంద్రంలోకి వె